## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని కాటవరం చెందిన వెంకటమ్మ అనారోగ్యానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. మృతురాలి కుమారుడు బుచ్చన్నను ఓదార్చి అంత్యక్రియల కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కోయిల్‌కొండలో త్రీకే రన్



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో నేషనల్ డే సందర్భంగా సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో '3 కే రన్'ను ఎస్ఐ శ్రీనయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా కోయిల్‌కొండ నుంచి పారుపల్లి వరకు 3కిలోమీటర్లు వరకు యువకులకు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలరాజ్, వీరయ్య, వెంకట్‌నాయక్, యువకులు పాల్గొన్నారు.

### నేడు డబుల్ బెడ్రూం ఇళ్లు ప్రారంభం

నవాబుపేట: మండలంలోని రుద్రారం, యన్మన్‌గండ్ల, తీగలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మంగళవారం ప్రారంభించారు. యన్మన్‌గండ్లలో 48, రుద్రారంలో 24, తీగలపల్లిలో 24 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. తీగలపల్లిలో మాత్రమే లబ్ధిదారులకు ఇళ్లను అందించనుండగా రుద్రారం, యన్మన్‌గండ్లలో వాటిని ప్రారంభించి లబ్ధిదారులను తర్వాత ఎంపిక చేసి అందించనున్నారు.

### న్యాయవాదుల విధుల బహిష్కరణ

జడ్చర్ల: స్థానిక కోర్టు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతి, సిబ్బందిపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్ షాకీర్, శ్రీనివాస్‌గౌడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

### కొల్లూర్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌లో 4 రోజుల పాటు నిర్వహించే ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని సోమవారం ప్రారంభించారు. టోర్నీలో 66 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులకు ఉప సర్పంచ్ నర్సింహచారి టీషర్టులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తులసీరాంనాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందర్, రాజు, కృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

### శబరిమలకు తరలిన భక్తులు



హన్వాడ: మండలంలోని టంకరలో అయ్యప్ప భక్తులు సోమవారం శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీక్షలో ఉన్న వారు ఆలయంలో ఇరుముడులు కట్టుకున్నారు.

### పాఠశాలకు బెంచీల వితరణ

చిన్నచింతకుంట: మండలంలోని అల్లిపురం ప్రాథమిక పాఠశాలకు స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘుగౌడ్, ఉప సర్పంచ్ విష్ణు చారి, తదితరులు ఉన్నారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

గండీడ్: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో, సభ్యులు హాజరుకావాలని కోరారు.

### ఆయుష్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: ఉమ్మడి జిల్లా ఆయుష్ ఫార్మాసిస్టుల సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తరయ్య హాజరయ్యారు. ఆయన సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శిగా దశరథం, గౌరవ అధ్యక్షుడిగా వెంకటస్వామి, కోశాధికారిగా పుష్పలత, సభ్యులను ఎన్నుకున్నారు.

# కమీషన్ల కోసం వేధింపులు

- చేసిన పనులకు బిల్లులు రావడం లేదు
- పీఆర్ డీఈ తీరుపై సభ్యుల ఆగ్రహం
- మద్యం షాపులో ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్మకం
- మండల సభల అధికారులను నిలదీసిన సభ్యులు



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అడ్డాకుల: ఉపాధి హామీలో పనులు చేస్తే నెలల తరబడి బిల్లులు రావడం లేదని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, వైస్ ఎంపీపీ రాధిక, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఉపాధి అంశంపై చర్చలో బిల్లుల ఆలస్యంపై సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనులను తమతో ఆగమేఘాల మీద చేయించిన అధికారులు బిల్లుల చెల్లింపులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని నిలదీశారు. రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉంటే గ్రామాల్లో తాము ఇక ముందు పనులెలా చేయగలమని ఆవేదన చెందారు.

**పీఆర్ డీఈ తీరుపై ఆగ్రహం**

పంచాయతీరాజ్ డీఈ శివరామకృష్ణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నాణ్యవంతంగా పనులు చేసినా డీఈకి మాత్రం 2శాతం మామూలు ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని మూకుమ్మడిగా ఆరోపించారు. బిల్లుల కోసం కార్యాలయంలో ప్రతి టేబుల్‌కు పైసలియ్యాల్సి వస్తోందని, లేకుంటే దస్త్రాలు ముందుకు వెళ్లడం లేదని వాపోయారు. ఒక్కసారి కూడా డీఈ మండలానికి వచ్చి పనులను పరిశీలించింది లేదని, మండల సభకు వచ్చింది లేదని మండిపడ్డారు. మరోసారి ప్రత్యేక సభను ఏర్పాటు చేసి డీఈని సభకు పిలిపించాలని సభ్యులు నిర్ణయించారు.

**తాగునీటిపై అధికారుల నిలదీత**

తిమ్మాయిపల్లి తండా, చౌడాయపల్లి, వర్నె తదితర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని వాపోయారు. మిషన్ భగీరథ నీళ్లు రానందున తిమ్మాయిపల్లిలో చాలా ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ కిషన్‌నాయక్ తెలిపారు. తండాలో నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ అధికారులను ఆదేశించారు. రాచాలలో కరెంటు స్తంభాలను పాతినా మూడేళ్ల నుంచి తీగలు బిగించడం లేదని సర్పంచ్ తిరుపతయ్య సభ దృష్టికి తెచ్చారు. విద్యుత్ కాంట్రాక్టర్ చేసిన పనుల గురించి సర్పంచులకు తెలియడం లేదని, చేసిన పనులకు సంబంధించిన దస్త్రాలపై తమ సంతకం చేయించుకునేలా చేయాలని సర్పంచులు ఏఈని కోరారు. బీటీరోడ్లకు నిధులు వచ్చినా పనులు మొదలు కావడం లేదని సభలో చర్చించారు. కందూర్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరితే దాన్ని మూసివేసి మరోచోట ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం మూలంగా పిల్లలకు ఏదైనా అయితే బాధ్యులెవరని జెడ్పీటీసీ ఎంఈఓ నాగయ్యను ప్రశ్నించారు. తండాలో ఇటీవల వృద్ధుడిని ఎక్సైజ్ పోలీసులు అకారణంగా చితకబాదారని తండా సర్పంచ్ కిషన్‌నాయక్ ఆరోపించగా కావాలని చేసింది కాదని ఎక్సైజ్ ఎస్ఐ ఉమామహేశ్వర్ సర్ది చెప్పారు. అడ్డాకుల మద్యం షాపులో ప్రతి సీసాకు రూ.10 అదనంగా తీసుకుంటున్నారని వారి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, ఏపీఎం సుదీర్, ఏపీఓ అతహార్, సభ్యులు పాల్గొన్నారు.

## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



మిడ్జిల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ జమ్ములప్ప

మిడ్జిల్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సీఐ జమ్ములప్ప సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మిడ్జిల్ ప్రీమియర్ క్రికెట్ లీగ్‌ను ఆయన ప్రారంభించిన మాట్లాడారు. 13ఏళ్లుగా క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషమని అన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, ఎస్ఐ రాంలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: యువత విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని డీఎస్పీ మహేష్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు.

## ఆలయ కమిటీ ఏర్పాటు



బాలానగర్: మండలంలోని తిరుమలగిరి ఆంజనేయస్వామి కమిటీని సోమవారం ఎంపిక చేశారు. చైర్మన్‌గా నేనావత్ జగన్ నాయక్, గౌరవ అధ్యక్షులుగా రాంజీ నాయక్, హన్మంత్ నాయక్, రాంచంద్రయ్యలను, వైస్ చైర్మన్‌గా రవీందర్, సెక్రటరీగా చందర్, కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 14, 15వ తేదీలలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### ఆకతాయిలపై చర్యలు

దేవరకద్ర రూరల్: రైళ్లల్లో ప్రయాణం చేస్తున్న వ్యక్తులపై బయటనుండి రాళ్లు విసిరి గాయపరుస్తున్న ఆకతాయిలపై చర్యలు తప్పవని రైల్వే సీఐ సురేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో తమ సిబ్బందితో కలిసి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కదిలే రైలును ఎక్కడానికి ప్రయత్నించడం ప్రమాదకరం అని సూచించారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది తాసిన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### విద్యార్థి నాయకుల అరెస్ట్

బాలానగర్: పాత పద్ధతిలోనే పోలీసు ఈవెంట్స్ నిర్వహించాలని చలో ప్రగతిభవన్ ముట్టడికి విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చారు. దీంతో సోమవారం పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విష్ణు మాట్లాడుతూ గతంలో ఈవెంట్స్‌లో 3.8గా ఉన్న లాంగ్ జంప్‌ను 4 మీటర్లకు పెంచి నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు.

### ముగ్గుల పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేట్ పాఠశాలల ఆధ్వరంయలో సోమవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఆకృతి పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి లభించింది.

### అడ్మిషన్ల గడువు పెంపు

కోస్గి: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా దూరవిద్యా విధానంలో 10వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు మరోమారు అడ్మిషన్ల గడువు పెంచుతూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల అధ్యయన కేంద్ర ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ శ్రీలత ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేది వరకు ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు పెంచిన ప్రవేశాల గడువు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలన్నారు.

## బీటీగా మారనున్న మట్టిరోడ్లు



బీటీగా మారనున్న గుబ్బడిగుచ్చతండా రోడ్డు



కొనసాగుతున్న మెట్టుగడ్డతండా రోడ్డు పనులు

నవాబుపేట: మండలంలో మట్టి రోడ్లన్నీ బీటీగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి గుంతలుగా ఉన్న రోడ్లు ఎట్టకేలకు రూపురేఖలు మారనున్నాయి. కనీసం రవాణా సౌకర్యం సైతం లేని గ్రామాలకు బీటీ రోడ్డు వేస్తుండడంతో అభివృద్ధిలో ముందుకు సాగనున్నాయి.

**మారుమూల రోడ్లకు మహర్దశ**

మారుమూల ప్రాంతాలకు రోడ్లు సరిగా లేకపోవటంతో నడిచి వెళ్లే పరిస్థితి. ఈ తరుణంలో ఈ రోడ్లన్నీ బీటీగా మార్చేందుకు నిధులు మంజూరు కావటంతో ప్రజలు సంతోష వ్యక్తం చేస్తున్నారు. కొల్లూర్ నుండి బట్టోనిపల్లితండా వరకు, రేకులచౌడాపూర్ నుంచి గుబ్బడిగుచ్చాతండా వరకు, చౌడూర్ నుంచి మెట్టుగడ్డతాండ వరకు, లింగంపల్లి రోడ్డు నుంచి కాకార్‌జాల్‌తండా వరకు గల రోడ్లు రూ.26 కోట్లతో ఏర్పాటు చేశారు. తాజాగా రూ.6 కోట్లతో మరో రెండు రోడ్లు 5 గిరిజన తండాలకు రానుండటంతో తండా వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

**పదేళ్లుగా నిరీక్షణ**



పదేళ్లుగా రోడ్డు కోసం వేచి చూస్తున్నాం. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్నా కనీసం మా ఊరికి బస్సు రావటం లేదు. రోడ్డు వేయడంతో ఎంతో సంతోషంగా ఉంది.

– బొజ్జమ్మ, సర్పంచ్, కొండాపూర్

## అర్హులకే దళితబంధు ఇవ్వాలి

నారాయణపేట టౌన్ : అర్హులకే దళితబంధు ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొదిగెలి శ్రీనివాస్ అన్నారు. ఎవరూ అర్హులు ఎవరో ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యేకు తెలియదా అని ప్రశ్నించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధన్వాడ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన కుటుంబాలతో మాట్లాడారు. దళితబంధు అర్హులకు కాకుండా అధికార పార్టీ కార్యకర్తలకు ఇస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా లబ్ధిదారుల నుంచి కమిషన్లు వసూలు చేస్తున్నారని అన్నారు. కార్యాలయ ఏఓ నర్సింగ్‌రావుకు వినతి పత్రం అందించారు. నాయకులు బాల్‌రాజ్, కడపరాయుడు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ధన్వాడ: తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా చిత్రపటానికి సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, మైనారిటీ కన్వీనర్ సయ్యద్ మహమ్మద్ ఉన్నారు.

మాగనూర్: బహుజన్ సమాజ్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను సోమవారం మండల కన్వీనర్ సగరం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

## కాలనీని పట్టించుకోండి

### బుడగజంగాల కాలనీలో కనిపించని కనీస వసతులు



బుడగ జంగాల కాలనీలో పూరిగుడిసె

కోయిల్‌కొండ: పక్కా ఇళ్లకు నోచుకోక పూరి గుడిసెల్లో జీవనం గడుపుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బూర్గుపల్లిలో బుడిగ జంగాల కాలనీ ఏర్పడి 30ఏళ్లు దాటింది. గ్రామంలో150కు పైగానే బుడగ జంగాల జనాభా ఉంది.50పైగా పూరి గుడిలు ఉన్నాయి. ఈ కాలనీలో కనీస వసతులు లేవు. కాలనీలో నీటి వసతి కల్పించారు. ఎక్కడా డ్రెయినేజీలు ఏర్పాటు చేయలేదు. డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో దోమలు, ఈగల సంచారంతో కుటుంబాలు రోగాల బారిన పడుతున్నారు. గతంలో బూర్గుపల్లి 40కిపైగా డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు అయ్యాయని అధికారులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మారాయి.

**డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలి**



మా కాలనీ ఏర్పడి 30 ఏళ్లు దాటింది. ఇంత వరకు మాకు పక్కా ఇళ్లులేవు. పూరి గుడెసెల్లోనే ఉంటున్నాం. ఈ గుడిసెలు పాడై వర్షానికి కారుతున్నాయి. ఇళ్లు నిర్మించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నాం.

– రాములు, బూర్గుపల్లి

**అన్నీ సమస్యలే..**



మా కాలనీలో అన్ని సమస్యలే ఉన్నాయి. ఇళ్లు లేకపోవడం, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించాలి. మాకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయించాలి. గతంలో ఇల్లు నిర్మిస్తామని వచ్చిన అధికారులు పట్టించుకోవడం లేదు.

– పాపమ్మ, బూర్గుపల్లి

# ఏటీఎం కేంద్రం ఎక్కడ?



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఏటీఎంకు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని క్లాక్ టవర్ నుంచి మార్కెట్ రోడ్డు వెళ్లే మార్గంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఉంది. కొన్ని రోజుల క్రితం దాని పక్కనే ఉన్న ఏటీఎం కేంద్రం ఎవరికీ కనిపించకుండా అడ్డంగా రోడ్డుపై ప్రైవేట్ వ్యక్తులు రెండు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో ఖాతాదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసలే ఆ ప్రాంతం ఎప్పుడూ ఎంతో రద్దీగా ఉంటుంది. ఆవరణలోకి వెళితే తప్ప ఈ కేంద్రం కనిపించడం లేదు. ఈ విషయమై బ్రాంచ్ మేనేజర్ పి.సి.పాండాను వివరణ కోరగా అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగింపజేస్తామన్నారు. ఏటీఎం వద్దకు వచ్చే ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పారిశ్రామికవాడలోగల ఫోరం కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2021 డిసెంబర్ నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, సర్వీసులో ఉన్న కాలానికి రావాల్సిన డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. రిటైర్డ్ అయి ఆరు నెలలు గడిచినా చివరి నెల వేతనం, పీఆర్‌సీ బకాయిల బాండుపత్రాలపై రావాల్సిన డబ్బులను చెల్లించలేదన్నారు. ఆర్టీసీ క్లీనిక్‌లో మందుల కొరత తీవ్రంగా ఉందని, ఫార్మాసిస్ట్, ల్యాబ్‌టెక్నీషియన్ లేరని, బీపీ, షుగర్, గుండె జబ్బులకు చికిత్సలు నిర్వహించడం లేదన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు మాట్లాడుతూ కనీస పెన్షన్ కరువు భత్యంతో రూ.7,500 పెంపు జాతీయ సంఘర్షణ సమితి ఆందోళనలతోనే సాధ్యమన్నారు. సమావేశంలో నారాయణ, భగవంతు, ఎల్లప్ప, ఉమేష్‌కుమార్, అబ్దుల్ కరీం, బస్వరాజ్, కిష్టయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్‌తో తీరనున్న రవాణా సమస్య



సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బైపాస్ రోడ్డుతో హైదరాబాద్‌కు వెళ్లడం సులభమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని వీరన్నపేట పాత ఈద్గా సమీపంలో, కొత్త రైల్వేగేట్ వద్ద, మక్కామసీదు ప్రాంతంలో, హెచ్ఎన్ ఫంక్షన్ హాలు సమీపంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని వైపులా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఒకేసారి పెద్ద మొత్తంలో కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమం ప్రపంచంలో ఇప్పటి వరకు ఎవరూ చేపట్టలేదని, అది ప్రభుత్వం నిర్వహించిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ నెల 18 నుండి నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం పై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొరపాట్లకు తావు లేకుండా గ్రామాలు, మున్సిపల్ వార్డులలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని ఏటీఆర్ ఉన్నత పాఠశాల క్యాలెండర్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఆవిష్కరించారు.

**అనధికార స్థలాలకు రెగ్యులరైజేషన్ పొందిన వారికి సహకారం**

జీఓ నంబర్ 58 కింద అనధికారిక స్థలాల రెగ్యులరైజేషన్ పొందిన వారికి భవిష్యత్‌లో సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెగ్యులరైజేషన్ అయిన వారికి ఇంటి పట్టాలను అందజేశారు.

## 'పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం'

మరికల్: మండలంలోని చిత్తనూర్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత, బీఆర్ఎస్ నాయకుడు వర్కటం జగన్నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన స్లాబ్‌కు మరమ్మతులు, టాయ్‌లెట్స్ నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు పనులతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం స్మార్ట్ టీవీ అందజేస్తామన్నారు. దీంతోపాటు ఉన్నత చదువుల నిమిత్తం మరికల్‌కు వెళ్లే విద్యార్థుల కోసం నారాయణపేట డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

నారాయణపేట రూరల్ : ప్రగతిభవన్ ముట్టడికి బయలుదేరిన ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యదర్శి నరహరి, కాశీ, రవికిరణ్, వెంకటేష్, శ్రీనివాస్ ఉన్నారు.

మాగనూర్: ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఛలో ప్రగతి భవన్ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వెళ్తుండంగా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు చిన్న నర్సింహ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉధ్యమాలను ఆపలేరని అన్నారు. నాయకులు సాయికేత్, రాఘవేంద్ర, నరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

మద్దూరు: ప్రగతిభవన్ ముట్టడికి తరలుతున్న డీఐఎఫ్ఐ జిల్లా క్యారదర్శి మహ్మద్‌అలీ, కన్కప్ప, ఆంజనేయులు పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

### కనుల పండువగా బీరప్ప ఉత్సవాలు

మక్తల్: బీరప్ప దేవర ఉత్సవాలను సోమవారం జక్లేర్‌లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటిరోజు పట్టం కట్టడం, రెండోరోజు బండారు(పసుపు), మూడవరోజు మొక్కలు చెల్లించడం, నాల్గోరోజు ఎల్లమ్మ బండారు కార్యక్రమం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే వేడుకులకు కర్ణాటక, మహరాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సీఐ సీతయ్య, ఎస్ఐ పర్వతాలు ,ఆధ్వర్యంలో గట్టి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ ఎంపీపీ కొండయ్య, కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.